క్లుప్తంగా

పరామర్శ



శ్యామలాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: మండలంలోని కైలాం గ్రామ సర్పంచ్ గండి శ్యామలాదేవి ఇటీవల మరణించారు. ఈ మేరకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆదివారం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి కొంపంగి గ్రామం వెళ్లి, ఆ గ్రామ మాజీ సర్పంచ్ సారికి సురేష్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అనంతరం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ కుటుంబ సభ్యుల్లో ఒకరైన అశ్విని మృతి చెందిన విషయాన్ని అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, కొంపంగి సర్పంచ్ రమణ ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యవంతమైన పంట



రైతులకు సాగు సలహాలు ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి: సేంద్రియ ఎరువులతో ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని, పంట దిగుబడులు కూడా బాగుంటాయని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో రైతు అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఖరీఫ్ సాగుకు సిద్ధమైన ప్రతీ రైతు సేంద్రియ ఎరువుల వినియోగానికి ఆసక్తి కనబరచాలని కోరారు. సేంద్రియ వ్యవసాయం లాభాదాయకమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం



వావిలవలసలో నిరుపేదలకు అన్నదానం చేస్తున్న పాలూరి సిద్ధార్థ

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త పాలూరి సిద్ధార్థ నిత్యాన్నదానం చేస్తున్నారు. 2020 నుంచి గ్రామంలోని తన ఇంటి వద్ద 25 మంది నిరుపేదలకు ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనం పెట్టి, ఆదుకుంటున్నారు. ఎంతోమంది రాజకీయ నాయకులు, కలెక్టర్లు, ఎస్పీలు తనకు సహాయసహకారాలు అందించారని, వారందించిన సహకారంతోనే ఈ కార్యక్రమం కొనసాగించగలుగుతున్నానని సిద్ధార్థ తెలిపారు. దాతల సాయంతో అన్నసత్రం కూడా నిర్మించామన్నారు.

'యాంటీ లార్వా ఆపరేషన్'



రాజాంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: పట్టణంలోని పలు వార్డుల్లో యాంటీ లార్వా ఆపరేషన్ ఆదివారం చేపట్టారు. దోమల నివారణే లక్ష్యంగా మురుగుకాలువలు, చెత్త కుప్పలు ఉన్నచోట దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు. మురుగునీటి ప్రాంతాల్లో దోమలు పెరిగేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని, దోమల ద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతాయన్నారు. ఈ నేపథ్యంలో మన ఇళ్ల ముందు ఎటువంటి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకాలు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. ఆదివారం అమ్మ వారికి ప్రత్యేకత కావడంతో తెల్లవారు జామున 5గంటల నుంచే అర్చకులు అమ్మవారికి అభిషేకాలు చేసి, అనంతరం అమ్మవారిని అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో అమ్మవారి దేవస్థానంలో దాతల సహకారంతో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రక్తదానం.. ప్రాణదానం..

రాజాం సిటీ: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకురావాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కోరారు. స్థానిక పాలకొండ రోడ్డులోని వైభవ్ జ్యూయలరీ షాపు ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంస్థ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. 20 మంది జ్యూయలరీ సిబ్బంది రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానంపై ఎంతోమందికి ఎన్నో అపోహలు ఉంటాయని, వాటిని వీడి రక్తం దానం చేయాలన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి రక్తం దానం చేయవచ్చని, మనమిచ్చే రక్తం ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడడమే కాకుండా ఒక కుటుంబానికి పెద్దదిక్కును కాపాడుతుందన్నది గ్రహించాలన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, మానవతా సంస్థ అధ్యక్షుడు బి.వి.అచ్యుత్‌కుమార్, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు, ఏఎస్‌ఐ రమణమ్మ, జ్యూయలర్స్ ప్రతినిధులు రంజిత్‌కుమార్, బాలరాజు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు, తదితరులు

తక్షణమే భూ ఆక్రమణలు తొలగించండి

● సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

తెర్లాం: గ్రామాల్లోని ప్రభుత్వ, ఇనాం భూముల ఆక్రమణలను తక్షణమే తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. మండలంలోని పెరుమాళి గ్రామంలో ఆక్రమణకు గురైన ఇనాం(దేవుడి మాణ్యం), డి-పట్టా భూములను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రభుత్వ భూములతో పాటు, ఇనాం భూములను చాలావరకు పెత్తందారులు ఆక్రమించారని, ఆక్రమణదారులపై చర్యలకు రెవెన్యూ అధికారులు ముందుకురాకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆక్రమణలు అడ్డుకోవాల్సిన అధికారులే మొద్దునిద్రలో ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రతీ గ్రామంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి, ఏ గ్రామంలో ఎంతమేర ప్రభుత్వ, ఇనాం భూములు ఉన్నాయో ప్రకటించాలన్నారు. అధికారుల అండతో ఇప్పటికే చాలా గ్రామాల్లో చాలావరకు డి-పట్టా, ఇనాంభూములు రియల్ ఎస్టేట్‌లుగా పెత్తందారుల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ, ఇనాం భూములను నిరుపేదలకు పంచిపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.



పెరుమాళిలో ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

జగన్నాథుడి నూతన రథం సిద్ధం

విజయనగరం టౌన్: దాసన్నపేటలో కొలువైన శ్రీజగన్నాథస్వామి రథం పాతబడి మూలకు చేరిపోవడంతో దాని స్థానంలో దేవాదాయశాఖ దాతల సహకారంతో రూ.13లక్షల వ్యయంతో నూతన రథాన్ని నిర్మించింది. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో ఆదివారం స్వామివారికి, నూతన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నిలిపిన రథాలకు పుణ్యాహవచనం, పూజలు, శాంతిహోమం చేశారు. అనంతరం రథ చక్రాలకు సంప్రోక్షణలు చేసి కొబ్బరికాయ కొట్టి, మంగళహారతులు ఇచ్చారు. ఈ ఏడాది నూతన రథాలపై స్వామివారు దర్శనమిస్తారని తెలియడంతో భక్తులు వాటిని తిలకించేందుకు తరలివచ్చి, హర్షం వ్యక్తం చేశారు. ఆలయ అర్చకులు రామకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న మోదీ సర్కార్

బొబ్బిలి: కార్పొరేట్‌కు ప్రధాని మోదీ కొమ్ముకాస్తూ సామాన్య ప్రజల నడ్డివిరుస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి పొట్నూరు శంకరరావు విమర్శించారు. ఇదే విషయమై ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు కొన్ని వేల కోట్ల రూపాయలు సాయంగా అందించారన్న కారణంగానే ముఖేష్ అంబానీకి జియో నెట్‌వర్క్ సర్వీస్ చార్జీలు విపరీతంగా పెంచుకునేలా మోదీ సర్కార్ అనుమతులు ధారాదత్తం చేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ అయిన బీఎస్‌ఎన్‌ఎల్‌ను మాత్రం కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రజాసంపదను అంబానీ, అదానీలు వంటి పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టి, ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ఇది దేశద్రోహం కాదా అని ప్రశ్నించారు. ప్రజలు కూడా దేశభక్తి ఉంటే బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్‌కు మారి, మోదీకి, అంబానీకి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో బి.యుగంధర్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి శంకరరావు

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

తెర్లాం: ప్రతీ విద్యార్థి ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుని, దానిపై ఆసక్తి పెంచుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతీ విద్యార్థితో పుస్తకాలు చదివించి, పుస్తకాలు ఏవిధంగా చదివితే సులభంగా అర్థమవుతుందోనన్న విషయం తెలియజేశారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులంతా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరిన విద్యార్థులకు ఏమేమి ప్రయోజనాలు ఉంటాయో వివరించారు. ప్రతీ విద్యార్థి పుస్తకాలు బాగా చదవాలని, పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన జ్ఞానం కలుగుతుందన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు.



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైత సిద్ధాంతం సారాంశం వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మలు ఆధ్యాత్మికంగా చాలా ముఖ్యమైనవని, వీటి ఆధారంగానే ప్రబోధానందయోగీశ్వరులు ఈ త్రైత సిద్ధాంతం రచించారని తెలిపారు. ఆత్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదన చేసి, శాస్త్రబద్ధమైన ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందన్నారు. అనంతరం 10 మంది గ్రామస్తులకు భగవద్గీతను బహూకరించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు రామినాయుడు, రాజు, గణేష్, మల్లీశ్వరి, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత చూపిస్తున్న అలజంగి గ్రామస్తులు

చెరకు సాగులో.. యాజమాన్య పద్ధతులు పాటించాలి



వెంకటాపురంలో ఐదుసాళ్లు విస్తీర్ణంలో చెరకు సాగు చేస్తున్న రైతు

రేగిడి: చెరకు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో యాజమాన్య పద్ధతుల ద్వారా చెరకు సాగుచేసి అధిక దిగుబడులు సాధిస్తున్న రైతు కింజరాపు సురేష్‌కుమార్ పంటపొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. చెరకు విత్తే సమయంలో ప్రధానంగా ఒక వరుసకు మరో వరుసకు మధ్య రెండు అడుగులు మాత్రమే ఖాళీ ఉంచుతారని, అలాకాకుండా ఐదడుగుల సాళ్ల తేడా ఉంటే పంట ఏపుగా పెరుగుతుందన్నారు. ఈ విధానం అవలంబిస్తే పంట చీడపీడల బారినపడదన్నారు. అలాగే పంటలో కలుపు తీసేందుకు వీలుంటుందని, మినీట్రాక్టర్ ద్వారా దుక్కుకు అవకాశం ఉంటుందన్నారు. చెరకును నరికేందుకు కూడా వీలుగా ఉంటుందన్నారు. పూర్తిగా యాంత్రీకరణతో చెరకు సాగుచేస్తే ఎకరాకు 60 నుంచి 70 టన్నుల వరకు దిగుబడి సాధించవచ్చన్నారు. గాలి, వెలుతురు బాగా పంటకు వచ్చే అవకాశం ఉందని, మొదళ్లు బలంగా మారుతాయన్నారు.

ముక్తికి చివరి సాధనం మానవజన్మ

రేగిడి: దేహమే దేవాలయమని ప్రతిఒక్కరూ గుర్తించాలని, దేహాన్ని పవిత్రమైన ఆలోచనలతో ఉంచుకోవాలని విశాఖపట్నం జిల్లాలోని సరిపిల్లి గ్రామ యోగా దివ్యదామ్ పీఠం యోగాచార్య పరమానంద గురూజీ తెలిపారు. మండలంలోని రేగిడి గ్రామంలో ఉన్న దత్తపీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో దత్తజ్ఞాన బోధసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవజన్మ అనేది ముక్తిని పొందే చివరి సాధనమని, ఈ విషయం గుర్తెరిగి అందరూ మంచి మనసుతో జీవించాలన్నారు. దేహమే దేవాలయంగా, జీవుడే దేవునిగా భావించి సేవలు చేయాలన్నారు. అనంతరం దత్త పాదుక పూజ, గణపతి హోమం, ఆధ్యాత్మిక ప్రవచనాలు చేపట్టారు. కార్యక్రమంలో జద్దు జగ్గారావు, భాస్కరరావు, కొండంపేట సంకీర్తనానందస్వామి, దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి ఉచిత యోగా శిక్షణ

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో జూలై 2వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రాజాం వికాస తరంగిణి సభ్యుడు మురపాక గణేష్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. యోగా గురువు టి.టి.వి.రమణమూర్తి పర్యవేక్షణలో 11వ తేదీ వరకు ఈ తరగతులు జరగనున్నాయన్నారు. మొదటి బ్యాచ్‌లో పురుషులకు స్థానిక విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో ఉదయం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు, రెండో బ్యాచ్‌లో స్త్రీలకు వికాస తరంగిణి కార్యాలయంలో సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు వేర్వేరుగా తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శారీరక, మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నివారణకు ఉపయోగపడే సూర్యనమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామాలు నేర్పించనున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

బొబ్బిలి రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే సచివాలయ సిబ్బందికి ఆదేశాలు కూడా జారీ చేశామన్నారు. మండలంలోని 30 పంచాయతీల్లో ఉన్న 22 గ్రామ సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న మొత్తం 11083 మంది పింఛన్‌దారులకు 7 కోట్ల 36 లక్షల 666 రూపాయలు అందివ్వనున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో పంపిణీ పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించామన్నారు.

సత్కారం

సంతకవిటి: మండల పరిధిలోని మండాకురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన వాండ్రంగి ఉమాశంకర్‌ను సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో గురువుకు ఉన్న గుర్తింపు మరెవరికీ లేదన్నారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌ను తీర్చిదిద్దే గురుతరమైన బాధ్యత దక్కినందుకు తాను ధన్యుడనన్నారు.

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి



పాగిరి సమీపంలో సాగుచేస్తున్న మొక్కజొన్న పంట

రాజాం: మండలంలోని పలు గ్రామాల రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. పాగిరి, నందబలగ, శ్యాంపురం, లక్ష్మీపురం, గడిముడిదాం, కంచరాం, బొద్దాం, పెనుబాక తదితర గ్రామాల్లోని రైతులంతా మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. తక్కువ సమయంలో చేతికి అందివచ్చే పంట కావడంతో పాటు మెట్టుప్రాంతాల్లో కూడా సులభంగా పండించుకునేందుకు అవకాశం ఉండడంతో ఆయా గ్రామాల రైతులు పంట వేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం మండలంలో 3 వేల హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు వేసినట్లు వ్యవసాయ శాఖ ఏవో రేణుకాసాయి తెలిపారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

రాజాం: మండలంలోని గారాజుచీపురుపల్లి యూనిట్ పరిధిలోని ముద్దాడజోగివలస గ్రామంలో జీవామృతం తయారీపై మహిళా రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. రెండు కిలోల బెల్లం, రెండు కిలోల పప్పుపిండి, గుప్పెడు పుట్టమన్ను, పది కిలోల ఆవుపేడ, పది లీటర్ల ఆవుమూత్రంలను ఒక టబ్బులో తీసుకుని, కలియబెట్టి ఉదయం, సాయంత్రం కర్రతో కలపాలని తెలిపారు. ఈ మిశ్రమాన్ని ఏడురోజుల తర్వాత 200 లీటర్ల నీటిలో వేసి పొలాల్లో, ఇంటి పెరటిలోని పంటలకు వేస్తే చీడపీడల నివారణ సాధ్యమవుతుందన్నారు. వీటి వినియోగం ద్వారా రసాయనిక ఎరువులను పూర్తిగా నివారించి, ఆరోగ్యవంతమైన పంటను సమాజానికి అందించవచ్చన్నారు.



జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామంలో వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, పరిసరాల పరిశుభ్రతపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్క రూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు. వర్షాకాలంలో మురుగునీటిలో పెరిగే దోమల కారణంగా మలేరియా, డెంగీ జ్వరాలు, కలుషిత నీరు, ఆహా రం తీసుకోవడం వల్ల డయేరియా వ్యాధి బారినపడే అవకాశం ఉందని తెలిపారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాచివడపోసిన నీటినే తాగాలన్నారు. ఎవరు ఏ ఆరోగ్య సమస్యతో బాధపడినా వెంటనే ఆస్పత్రిని సంప్రదించి, చికిత్స పొందాలన్నారు.



కొట్టక్కిలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

తెర్లాం: బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబీనాయన)ను మండలంలోని గొలగువలస గ్రామస్తులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని ఓ గ్రామంలో జరుగుతున్న ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు గొలుగువలస మీదుగా వెళ్తున్న ఎమ్మెల్యే గ్రామంలో కాసేపు ఆగి, గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ సమష్టిగా పనిచేసి, గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే బేబీనాయనతో గొలుగువలస గ్రామస్తులు

విత్తనశుద్ధిపై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస, గొర్లెసీతారాంపురం గ్రామాల్లోని రైతులకు విత్తనశుద్ధిపై ఆదివారం అవగాహన కల్పించారు. బీజామృతం, సూడోమోనాస్ పౌడర్‌తో విత్తనాలు ఏ విధంగా శుద్ధి చేసుకుని, వాడుకోవాలన్న దానిని వీఏఏ రాజశేఖర్ తెలిపారు. వరినారు కోసం విత్తనాలు పొలాల్లో వేసేముందు వాటిని ఆయా ద్రావణాలతో శుద్ధి చేసుకోవాలని, అలా చేయడం ద్వారా వరినారు మొలకశాతం పెరగడమే కాకుండా పంట తెగుళ్లు, చీడపీడల బారినపడకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



వరి విత్తనాలు శుద్ధి చేస్తున్న రైతులు